క్లుప్తంగా

5న శంకరమఠంలో చండీహోమం

నెల్లూరు(బృందావనం): చైత్ర పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో చండీహోమాన్ని ఈ నెల ఐదున నిర్వహించనున్నామని మఠం మేనేజర్ నందకిషోర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు విశేషంగా తరలిరావాలని కోరారు.

సంగీత, నృత్య పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(బృందావనం): ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలు, పాఠశాలల సర్టిఫికెట్, డిప్లొమా కోర్సుల వార్షిక పరీక్షలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎస్వీబీ ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల ప్రిన్సిపల్ సాయిబాబా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల పదో తేదీ వరకు ఫీజును చెల్లించొచ్చని, అపరాధ రుసుముతో 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. వివరాలకు కార్యాలయం లేదా 94403 61606 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బ్యాక్‌లాగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు(వేదాయపాళెం): వివిధ్న ప్రతిభావంతులకు సంబంధించిన బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఆ శాఖ ఏడీ నాగరాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. spsnellore. ap. gov. inను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా 'మహిషాసురుడు' ప్రీ రిలీజ్ ఈవెంట్



నెల్లూరు(బృందావనం): మహిషాసురుడు చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నగరంలోని పురమందిరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సినీ నటుడు రఘుబాబు మాట్లాడారు. కార్డియాలజిస్ట్ గురుప్రసాద్ నిర్మాతగా సందేశాత్మకంగా చిత్ర నిర్మాణాన్ని చేపట్టి.. స్థానిక నటీనటులతో పాటు పలువురికి అవకాశం కల్పించడం హర్షణీయమన్నారు. చిత్ర రంగంలో నెల్లూరుకు ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. కార్యక్రమానికి తనను ఆహ్వానించడంపై ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం రఘుబాబును సింహపురి మూవీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, దర్శకుడు రవికుమార్, క్రియేటివ్ డైరెక్టర్ రెమో, కళాసంఘాల కన్వీనర్లు హరిబాబు, అమీర్‌జాన్, హరనాథ్‌రెడ్డి, భాస్కర్, నటీనటులు స్వరూప, విజయహరిణి, లిఖిత, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

పొలాల వద్ద కరకట్టల దహనం



నెల్లూరు రూరల్: అక్కచెరువుపాడులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత విజయరామిరెడ్డికి చెందిన పొలాల వద్ద గల కరకట్టలను కొందరు శనివారం రాత్రి దహనం చేశారు. ఘటనపై వేదాయపాళెం పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. పొలాల్లో కొందరు వ్యక్తులు గుడిసెలను ఇటీవల వేసి ఆక్రమణలకు పాల్పడ్డారని.. రికార్డులను పరిశీలించిన అనంతరం ఆక్రమణలను రెవెన్యూ, పోలీస్ అధికారులు తొలగించారని ఆయన చెప్పారు. ఆక్రమణలకు పాల్పడిన వారే ఈ ఘాతుకానికి ఒడిగట్టి ఉండొచ్చని పేర్కొన్నారు.

నేత్రపర్వంగా బ్రహ్మోత్సవాలు



సరస్వతీదేవి అలంకారంలో వేణుగోపాలస్వామి

నెల్లూరు(బృందావనం): నగరంలోని మూలాపేటలోని రుక్మిణీ, సత్య భామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్స వాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం స్వామివారు సూర్యప్రభ, హంసవాహనంపై సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా బాలాజీ, రవీంద్రనాథ్ సింగ్, సత్యవతిబాయి దంపతులు, నిరంజన్‌రెడ్డి వ్యవహరించారు.

రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా మండలంలోని పుంజులూరుపాడు, నిడిగుంటపాళెం గ్రామాల్లో ఆదివారం సాయంత్రం మంత్రి పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పాలనపై ఆరాతీశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల్లోని పేదల అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేస్తున్నారన్నారు. చంద్రబాబు తన ఉనికి కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు తన పాలనలో ప్రజలను అన్ని విధాలా మోసం చేస్తే, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో ఇచ్చిన వాగ్దానాలతో పాటు ఇవ్వని హామీలను నెరవేస్తున్నారని కొనియాడారు. సర్వేపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం కోట్లాది రూపాయలు వెచ్చించామని వివరించారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుస్మిత, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, నాయకులు కొణిదెన మోహన్‌నాయుడు, విజయభాస్కర్‌నాయుడు, కట్టంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కట్టంరెడ్డి విజయకుమార్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, బాలయ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కంచెలతో వన్యప్రాణుల వేటపై విచారణ



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్

వెంకటాచలం : తిక్కవరప్పాడు–సర్వేపల్లి గ్రామాల మధ్యన అటవీ ప్రాంతంలో విద్యుత్ కంచెలతో వన్యప్రాణుల వేటపై అధికారులు విచారణ జరుపుతున్నారు. శనివారం రాత్రి ఆరుగురు వ్యక్తులు అటవీ ప్రాంతంలో విద్యుత్ కంచెలను ఏర్పాటు చేస్తుండగా స్థానికులు గమనించడంతో మోటార్‌సైకిల్‌ను వదిలేసి పరారైన విషయం తెలిసిందే. ఈ విషయం అటవీశాఖ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ఆదివారం ఉదయం వెంకటాచలం, తిక్కవరప్పాడు, సర్వేపల్లి గ్రామాల పరిధిలోని అటవీప్రాంతంలో అటవీశాఖ సిబ్బంది పరిశీలించారు. అటవీప్రాంతంలో ప్రధాన విద్యుత్ లైన్లు ఎక్కడ ఉన్నాయో గుర్తించి, అక్కడ అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు ఎలా ఇస్తున్నారో పరిశీలించారు. అనంతరం వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని విద్యుత్ కంచెలతో వన్యప్రాణులను వేటాడుతున్న వారిని గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. మోటార్ బైక్ ఆధారంగా వన్యప్రాణులను వేటాడుతున్న వారిని రెండ్రోజుల్లో గుర్తిస్తామని పోలీసులు తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



కొడవలూరు: కాణిపాకం వరసిద్ధి వినాయక మందిరంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు రూ.లక్ష విరాళం అందజేశారు. ఆదివారం ఆలయ నిర్వాహకులకు నగదు చెక్కు అందజేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగాలనే ఆకాంక్షతో తన వంతుగా నగదు విరాళాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

ఇందుకూరుపేట: మండలంలో సోమవారం నుంచి జరుగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఇన్‌చార్జి ఎంఈఓ జయంతిబాబు ఆదివారం తెలిపారు. ఇందుకూరుపేట ఎంకేఆర్ ఉన్నత పాఠశాల, నరసాపురం, ముదివర్తిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు జరుగనున్నట్లు చెప్పారు. మూడు పరీక్ష కేంద్రాల్లో 454 మంది రెగ్యులర్, 80 మంది సప్లిమెంటరీ విద్యార్థులు కలిపి మొత్తం 534 మంది పరీక్షలు రాయనున్నారని ఆయన వివరించారు.

పది పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

ముత్తుకూరు: మండలంలో సోమవారం నుంచి ప్రారంభమయ్యే పదోతరగతి పరీక్షలకు సంబంధించి మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ముత్తుకూరు హైస్కూల్‌లో 186 మంది, వీబీఆర్ హైస్కూల్‌లో 249 మంది, పిడతాపోలూరు రత్నం హైస్కూల్‌లో 219 మంది పరీక్షలు రాయనున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఆయా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ముత్తుకూరు ఎస్సై శివకృష్ణారెడ్డి తెలిపారు.

బుచ్చిరెడ్డిపాళెం: పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈఓ దిలీప్ తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెంలోని ఏడు కేంద్రాల్లో 1118 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులను కల్పించినట్లు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరిగే పరీక్షలకు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించమని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కోరారు.

క్రీడలతో ఉద్యోగులకు ఆటవిడుపు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కూర్మనాథ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే ఉద్యోగులకు క్రీడలతో ఆటవిడుపు లభిస్తుందని జేసీ కూర్మనాథ్ పేర్కొన్నారు. జిల్లా రెవెన్యూ శాఖ, జర్నలిస్ట్స్ జట్ల మధ్య ఫ్రెండ్లీ టీ - 20 క్రికెట్ మ్యాచ్‌ను ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం నిర్వహించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. కలెక్టర్ చక్రధర్‌బాబు సూచనల మేరకు మ్యాచ్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. రెవెన్యూ జట్టులో జేసీ, ఆర్డీఓ మలోల, తదితర అధికారులు ఉత్సాహంగా ఆడారు. తొలుత బ్యాటింగ్ చేపట్టిన రెవెన్యూ జట్టు నాలుగు వికెట్ల నష్టానికి 124 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగి జర్నలిస్ట్స్ జట్టు ఏడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

కోడూరు బీచ్‌లో సందర్శకుల కోలాహలం



తోటపల్లిగూడూరు మండలంలోని కోడూరు బీచ్ ఆదివారం సందర్శకులతో పోటెత్తింది. సాధారణంగా సెలవు, పండగ దినాల్లో సరదాగా గడిపేందుకు జిల్లా నలువైపుల నుంచి కోడూరు బీచ్‌కు సందర్శకులు తరలివస్తుంటారు. ప్రస్తుతం ఎండలు మండుతుండడంతో సేదతీరేందుకు జిల్లా నలువైపుల నుంచి కోడూరు బీచ్‌కు పర్యాటకులు ఆదివారం పోటెత్తి వచ్చారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన సందర్శకులతో పాటు స్నేహితులతో కలిసి వచ్చిన యువతీయువకులు గంటల కొద్ది సముద్రస్నానాలు ఆచరిస్తూ సంతోషంగా గడిపారు.

–తోటపల్లిగూడూరు

పొదలకూరులో చిరుజల్లులు

పొదలకూరు : మండలంలో ఆదివారం చిరుజల్లులు పడ్డాయి. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత, ఉక్కపోతతో ప్రజలు అల్లాడారు. సాయంత్రం వేళ ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడడంతో ప్రజలు సేదతీరారు. చిరుజల్లులతో వరి రైతులు ఆందోళనకు గురయ్యారు. మండలంలో ఇప్పటి వరకు వరికోతలు 60 శాతం మాత్రమే పూర్తయ్యాయి. మరో 40 శాతం పంట కోత పనుల్లో రైతులు ఉన్నారు. చాలా గ్రామాల్లో వారం రోజుల్లో నూర్పిళ్లు చేపట్టనున్నారు. వరికోత యంత్రాలు లభ్యం కాక కొందరు రైతులు సమయానికి కోతలు చేపట్టలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో వర్షం పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వైభవంగా పారువేట ఉత్సవం



పొదలకూరు : శ్రీరామనవమి వేడుకల్లో అయ్యప్పనగర్‌లోని శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో పారువేట ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భజన గురువు గంగిరెడ్డి ఆధ్వర్యంలో కోలాటాన్ని ప్రదర్శించారు.

వరదరాజస్వామి ఉత్సవాలకు అంకురార్పణ

బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి బ్రహ్మోత్సవాలకు ఆదివారం అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా వరదరాజస్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం పుట్టమట్టిలో నవధాన్యాలు చల్లి ఉత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఆలయ చైర్మన్ పీ ప్రేమ్‌సాగర్, ఈఓ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

వైభవంగా హనుమంతసేవ



బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక కోదండరాముడు ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం హనుమంతసేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం విశేష పూజలు, తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. రాత్రి కోదండరాముడి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి హనుమంత వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్ దొడ్ల మురళీకృష్ణారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతోందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని సాల్మన్‌పురంలో గడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల్లోని పేదల అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు రూ.1.95 లక్షల కోట్లతో వివిధ సంక్షేమ పథకాలను అమలు చేశారని వివరించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా కుల, మత, రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని తెలిపారు. సంక్షేమ పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. రాష్ట్రానికి శాశ్వత ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగాలని కోరుకుంటున్నారని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఇప్పటి వరకు 53 సచివాలయాల పరిధిలో 60,447 ఇళ్లు తిరగామని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వంలో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. గ్రామాల్లో అత్యవసరమైన పనులను గుర్తించి త్వరగా పూర్తి చేసేలా అధికారులను ఆదేశించామన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

బుచ్చిరెడ్డిపాళెనికి చెందిన టీడీపీ నాయకుడు ఇప్పగుంట సుధాకర్‌రెడ్డితో పాటు ఆయన అనుచరగణం మరో 50 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. సాల్మన్‌పురంలో ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.



ప్రభుత్వ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

శ్మశానం కోసం రూ.4 లక్షల విరాళం

సాల్మన్‌పురంలో శ్మశాన స్థలం లేక కాలువ కట్టలపై గ్రామస్తులు మృతదేహాలను ఖననం చేస్తున్నారు. ఈ విషయాన్ని గ్రామ నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ ద్వారా స్థలం కొనుగోలుకు రూ.4 లక్షలు విరాళం అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, ఎంపీపీ శ్రీనివాసులు, ఎంపీడీఓ నరసింహారావు, తహసీల్దార్ పద్మజ, ఏపీఎం లలిత, నాయకులు టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, కౌన్సిలర్లు షకీలా, చీర్ల ప్రసాద్, మోర్ల జయంతి, మల్లారెడ్డి, సత్యనారాయణ, నాయకులు కోడూరు మధుసూదన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అల్లాభక్షు, భరత్, జొన్నవాడ ప్రసాద్, గుమ్మా రఘురామయ్య నరసింహారెడ్డి, జయరామిరెడ్డి, సర్పంచ్ ఓడా పెంచలయ్య, మేనకూరు సీతారామిరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కాకాణి

మనుబోలు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మంచిపేరు తీసుకురావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు సూచించారు. మనుబోలులోని డీపీఆర్ కల్యాణ మండపంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కాకాణి పాల్గొని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు దిశానిర్దేశం చేశారు. ఏప్రిల్ 7న మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అందులో భాగంగా లబ్ధిదారులకు ఇవ్వాల్సిన కరపత్రాలు, వారిని అడగాల్సిన ప్రశ్నలు, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి గృహసారథులు పార్టీలు, వర్గాలకతీతంగా తమ పరిధిలోని 50 గృహాలను సందర్శించి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మనుబోలు, వెంకటాచలం, పొదలకూరు, ముత్తుకూరు, టీపీ గూడూరు మండలాల సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



బుచ్చిరెడ్డిపాళెం: మట్టలతో చిన్నారుల ప్రదర్శన



కొడవలూరు: నార్తురాజుపాళెంలో..



టీపీగూడూరు: చిన్నచెరుకూరులో..

బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంతో పాటు మండలంలోని చర్చిలు, క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో మట్టల ఆదివారాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిన్నారులు, యువత అందమైన పూలతో అలంకరించిన ఈత మట్టలను చేతపట్టి క్రైస్తవ గీతాలను ఆలపిస్తూ వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. దైవ సందేశకులు మట్టల ఆదివారం విశిష్టతను వివరించారు.

తోటపల్లిగూడూరు: చిన్నచెరుకూరులోని సాల్వేషన్‌ఆర్మీ చర్చి పాస్టర్ సిద్ధార్థ ఆధ్వర్యంలో మట్టల ఆదివారాన్ని నిర్వహించారు. చిన్నారులు పూలతో అలంకరించిన మట్టలతో ప్రదర్శన నిర్వహించారు. మట్టల ఆదివారం విశిష్టతను పాస్టర్ వివరించారు.

కొడవలూరు: నార్తురాజుపాళెంలోని సెంటినరి బాప్టిస్ట్ చర్చి సండే స్కూల్ సూపరింటెండెంట్ టీ సుప్రియ ఆధ్వర్యంలో చిన్నారులు ఈత మట్టలు చేతపట్టి ప్రదర్శన నిర్వహించారు. క్రైస్తవ ప్రార్థనా గీతాలు ఆలపిస్తూ వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. చర్చి పాస్టర్ డాక్టర్ ఎం ప్రేమ్‌నాథ్, చైర్మన్ బట్టేపాటి సుదర్శనం, కార్యదర్శి కోవూరు సురేష్, సభ్యులు దేవసహాయం, బొచ్చు శ్రీనివాసులు, తుమ్మలపెంట అహరోన్ పాల్గొన్నారు.

కలెక్షన్ ఏజెంట్ చేతివాటం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఓ ప్రైవేట్ ఏజెన్సీలో పనిచేస్తున్న కలెక్షన్ ఏజెంట్ రూ.3.5 లక్షలను స్వాహా చేసిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. అరుణాచలం వీధికి చెందిన మారుతిప్రసాద్ అదే ప్రాంతంలో యాదగిరి లక్ష్మీనరసింహ పేరుతో ఏజెన్సీని నిర్వహిస్తున్నారు. నగరంలోని పలు దుకాణాలకు హార్లిక్స్, డెటాల్, తదితరాలను సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో కలెక్షన్ ఏజెంట్‌గా కిరణ్‌కుమార్ 2019లో చేరారు. నగరంలోని దుకాణదారుల నుంచి ఆర్డర్లు తీసుకొని వస్తువులను ఏజెన్సీ ద్వారా సరఫరా చేసి.. దానికి సంబంధించిన నగదును జమచేసేవారు. గతేడాది డిసెంబర్‌లో ఏజెన్సీకి సంబంధించిన లావాదేవీలను మారుతి ప్రసాద్ పరిశీలించగా, రూ.3.5 లక్షలు గోల్‌మాలైన విషయాన్ని గుర్తించారు. ఈ విషయమై కిరణ్‌కుమార్‌ను నిలదీయగా, సదరు మొత్తాన్ని తాను వినియోగించానని అంగీకరించారు. త్వరలో నగదును చెల్లిస్తానని చెప్పినా, నేటికీ ఇవ్వకపోవడంతో నవాబుపేట పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ చోరీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బైక్ చోరీకి గురైన ఘటనపై నవాబుపేట పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. వివరాలు.. నగరంలోని ప్రశాంతినగర్‌కు చెందిన అఫ్రోజ్‌బాషా నెల్లూరు సబ్‌ట్రెజరీ కార్యాలయంలో ఎస్టీఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో పప్పులవీధిలోని స్లిమ్‌లైఫ్ జిమ్ వద్ద తన హీరో గ్లామర్ బైక్‌ను గత నెల 31న నిలిపి లోపలికి వెళ్లారు. తిరిగొచ్చేసరికి బైక్ కనిపించకపోవడంతో చుట్టుపక్కల గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.